ఫ్రీ హోల్డ్ భూములను పరిశీలించిన సబ్ కలెక్టర్

సీతానగరం, సెప్టెంబరు 18 : సీతానగరం మండలం వెన్నెల బుచ్చంపేటలో ఫ్రీ హోల్డ్ భూములను బుధవారం పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పరిశీలించారు. గ్రామంలో 34 మంది రైతులతో మాట్లాడారు. ఆ భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మండలంలో 23 గ్రామాలకు సంబంధించి ఫ్రీ హోల్డ్ భూములను మళ్లీ పరిశీలించాలని తహసీల్దార్ రాములమ్మను ఆయన ఆదేశించారు. రెండు టీములు అదే పనిలో ఉన్నట్లు సంబంధిత అధికారులు సబ్ కలెక్టర్‌కు తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్ఐ శ్రీనివాస్, డీటీ, సిబ్బంది ఉన్నారు.

ఉత్సవాలకు వేళాయే..

- నేడు తెరచాటుకు కోటదుర్గమ్మ
- ముస్తాబవుతున్న ఆలయం
- పాలకొండలో శరన్నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఈ నెల 19న అమ్మవారు తెరచాటుకు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అర్చనలు, అభిషేకాలు చేయనున్నారు. ఏడాదికి ఒక్కసారి అంటే తెరచాటుకు వెళ్లే రోజు మాత్రమే అమ్మవారు అసలైన విగ్రహానికి అభిషేకాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. మళ్లీ చందనం, పసుపు, కుంకుమ, ఇతర సుగంధ ద్రవ్యాలతో విగ్రహాన్ని అలంకరించి వచ్చేనెల 3న భక్తులకు నిజరూప దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఇదిలా ఉండగా గురువారం నుంచి ఉత్సవ విగ్రహాలు మాత్రమే భక్తులకు దర్శనం ఇవ్వనున్నాయి. అక్టోబరు మూడో తేదీ ఉదయం ముహూర్తపు రాట, నిజరూప దర్శనంతో ప్రారంభమై వచ్చేనెల 12 వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు.

ముమ్మర ఏర్పాట్లు...

ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం కోటదుర్గమ్మ అమ్మవారికి నవరాత్రి ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్సీ విక్రాంత్, ఉత్సవ కమిటీ, దేవదాయ శాఖ , ఈవో మురళీకృష్ణ, ప్రధాన అర్చకుడు లక్ష్మీ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో ఇప్పటికే సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్యేక క్యూ లైన్లు, వీఐపీ బ్రేక్, రూ.100 స్పెషల్, శీఘ్ర , ఉచిత దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ తొమ్మిది రోజుల పాటు ఆలయానికి వచ్చే భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం చేపట్టనున్నారు. క్యూలైన్‌లో ఉన్న భక్తులకు తాగునీరు, మజ్జిగ, చంటి పిల్లలకు పాలు తదితర వాటిని అందుబాటులో ఉంచేలా తీర్మానం చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక వాలంటరీ వ్యవస్థను తీసుకురానున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ నున్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి అమ్మవారి పండగలా పాలకొండ కోటదుర్గమ్మ ఉత్సవాలను రాష్ట్ర పండగగా గుర్తించాలని భక్తులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ, ఉన్నతాధికారులు ఈ విషయాన్ని దేవదాయశాఖామంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ఇక్కట్లు తప్పేనా?

కొన్నేళ్లుగా నిజరూప దర్శనం, విజయదశమి సమయాల్లో కోటదుర్గమ్మ ఆలయానికి వీఐపీల తాకిడి అధికంగా ఉంటుంది. ఈంతో సామాన్య భక్తులకు అగచాట్లు తప్పడం లేదు. సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చే వారికి మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. వాటిపైన తాత్కాలిక ఉత్సవ కమిటీ దృష్టి పెట్టాల్సి ఉంది. ఆలయం ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లలోనూ భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ప్రత్యేక అలంకరణలో కోటదుర్గమ్మ


ఉత్సవాలకు ముస్తాబవుతున్న కోటదుర్గమ్మ ఆలయం



శాసన సభాపక్ష సమావేశంలో..

మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం ఎన్డీయే శాసన సభాపక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, పార్వతీపురం, పాలకొండ, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో సాధించిన ప్రగతి, పరిష్కరించిన ప్రజా సమస్యలు తదితర అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. నియోజకవర్గాల వారీగా విజన్ డాక్యుమెంట్లు రూపొందించుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు.

- (పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)/పాలకొండ

అంగన్‌వాడీ సెంటర్లకు నిధులు

- వసతుల కల్పనకు చర్యలు: కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పార్వతీపురం, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లలో వసతుల కల్పనకు నిధులు మంజూరైనట్లు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. తాగునీరు, టాయిలెట్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకో నున్నట్లు చెప్పారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించిన లక్ష్యాలపై సమీక్షించారు. 'మన్యం'లో 469 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్స్ నిర్మాణానికి గాను ఒక్కో సెంటర్‌కు రూ.36 వేల చొప్పున కేటాయిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 512 సెంటర్లలో తాగునీటి సదుపాయం కోసం రూ.17 వేల చొప్పున మంజూరైనట్లు తెలిపారు. మొత్తంగా 981 పనుల బాధ్యతలను జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించామన్నారు. 'పార్వతీపురంలో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.. పాల కొండలో పనులు పూర్తికానున్నాయి. జిల్లాకేంద్రంలో 768 టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయింది.. తాగునీరు, అంతర్గత రోడ్లు, కాలువల సదుపాయం కల్పించాల్సి ఉంది. సాలూరులో 192 ఇళ్ల పనులు పునః ప్రారంభించాల్సి ఉంది.' అని కలెక్టర్ తెలిపారు. పంచాయతీల్లో 138 చెత్త సంపద తయారీ కేంద్రాల్లో 26 పనిచేస్తున్నాయని, మిగిలిన వాటిని వచ్చే నెల 2వ తేదీ నుంచి వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ అధికారులు లక్ష్యాలకు దూరంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం

- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం
- స్వాగతిస్తున్న ఉత్తరాంధ్ర ప్రజలు



విజయనగరం(ఆంధ్రజ్యోతి): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు ఖరారు చేస్తూ కేబినెట్ బుధవారం నిర్ణయం తీసుకుంది. ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఆయన నడయాడిన విశాఖ, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలు, ప్రజాప్రతి నిధులు, ప్రజాసంఘాలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2014 నుంచి 2019లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈ విమానాశ్రయానికి సీఎం హోదాలో చంద్రబాబు శంకుస్థాపన చేశారు. కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రిగా అశోక్ గజపతిరాజు అప్పట్లో బాధ్యతలు నిర్వహించారు. ఆయన హయాంలోనే భూ సేకరణ ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం 2016లో అన్ని అనుమతులు జారీ చేసింది. ఆ తర్వాత రైతుల నుంచి 2,700 ఎకరాలు సేకరించారు. 2019లో ప్రభుత్వం మారడం, జగన్ అనాలోచిత చర్యలతో విమానాశ్రయ పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భోగాపురం విమానాశ్రయ నిర్మాణం ఊపందుకుంది. రూ.4,700 కోట్లతో పనులు జరుగుతున్నాయి.

అభివృద్ధి పనులు చేసి.. అప్పుల పాలై..

- ఉపాధి కింద సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మించి ఏళ్లు గడుస్తున్నా అందని బిల్లులు
- ఏడాది కిందట కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో సర్పంచ్ ఫిర్యాదు
- అయినప్పటికీ ఎలాంటి చర్యల్లేవ్

జియ్యమ్మవలస: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు సంబంధించి నేటికీ బిల్లులు మంజూరవలేదు. దీంతో ఆ సర్పంచ్‌కు అప్పులే మిగిలాయి. తనకు న్యాయం చేయాలని ఏడాది కిందట కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించినా.. ఇంతవరకు ఎటువంటి చర్యల్లేవు. మొత్తంగా గ్రామంలో అభివృద్ధి పనులు చేయించి అప్పులపాలయ్యాయని పరజపాడు సర్పంచ్ గుంట్రెడ్డి రామకృష్ణం నాయుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. 2019-20లో రూ.7 లక్షల అంచనాతో పరజపాడు పంచాయతీలో పాత స్కూల్ నుంచి హెల్త్ సెంటర్ వరకు సీసీ రోడ్డు కమ్ డ్రైన్ పనులు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకంలో (వర్క్ ఐడీ నెంబరు 02703041 6042080052) మంజూరైన ఈ పనిని పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో గుంట్రెడ్డి పద్మావతి పేరిట సర్పంచ్ రామకృష్ణంనాయుడు చేపట్టారు. 150 మీటర్ల సీసీ రోడ్డు, కాలువలకు గాను సంబంధిత అధికారులు ఎంబుక్ (నెంబరు 13783/బి) రికార్డింగ్ చేశారు. కానీ బిల్లులు రాకపోవడంతో పంచాయతీరాజ్ ఈఈని, అప్పటి ఎంపీడీవో శంబంగి రమేష్‌ను కలిసి ఆయన విషయాన్ని తెలియజేశారు. అయితే ఆ వర్కు బిల్లులను మరోసారి ఉపాధి హామీ వైబ్‌సైట్‌లో జనరేట్ చేసి పంపాలని అప్పటి ఎంపీడీవో రమేష్‌కు 2023, ఫిబ్రవరి 17న పంచాయతీరాజ్ డివిజన్ ఈఈ లెటర్ జారీ చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో 2023, ఆగస్టు 19న సర్పంచ్ రామకృష్ణం నాయుడు నేరుగా కలెక్టర్ గ్రీవెన్స్ (నెంబరు 53)కు వెళ్లి అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అయితే ఏడాది పూర్తయినా ఇంతవరకు న్యాయం జరగలేదని ఆయన వాపోతున్నారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పందించాలని సర్పంచ్ కోరుతున్నారు. దీనిపై ప్రస్తుత ఎంపీడీవో పి.శ్రీనివాస రావును వివరణ కోరగా.. ఇప్పటికే ఆ పనుల బిల్లులను అప్‌లోడ్ చేశామని, ఎందుకు నిధులు మంజూరవ్వలేదో తెలియదని తెలిపారు.


పరజపాడు స్కూల్ వద్ద నుంచి నిర్మించిన సీసీ రోడ్డు

ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్‌పై అవగాహన

భామిని: ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్‌పై సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి అవగాహన కల్పించారు. బుధవారం భామిని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కాట్రగడ వరద కాలువ ముఖ ద్వారంలో సేకరించిన ఇసుక, డంపింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇసుక కావాలనుకునే వారు ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఉచిత ఇసుక విధానానికి సంబంధించిన పోర్టల్ గురువారం ప్రారంభమవుతుందన్నారు. ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన వెంటనే ఇసుకతో పాటు దానిని తరలించే వాహనాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. సచివాలయాలతో పాటు యాప్‌లోనూ బుక్ చేసుకోవచ్చన్నారు. కేవలం ఇసుక తవ్వకాలు, నిర్వహణ, రవాణా చార్జీలు మాత్రమే ప్రజలు భరించాల్సి ఉంటుందని చెప్పారు. సొంతింటి నిర్మాణం కోసం ఎడ్ల బండితో ఇసుక తీసుకెళ్లొచ్చని వెల్లడించారు. సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖరం, డీటీ రమేష్, ఆర్ఐ రాంబాబు, మైనింగ్ అధికారులున్నారు.


అవగాహన కల్పిస్తున్న సబ్ కలెక్టర్

ఐదేళ్లూ పట్టించుకోలే..

- ఎత్తిపోతల పథకంపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పునరుద్ధరణ
- నాడు ఏడాదికి మూడు పంటలు పండించిన గిరిజన రైతులు
- నేడు ఒక పంటతోనే సరి.. సాగునీరు అందక అవస్థలు

సీతంపేట రూరల్, సెప్టెంబరు 18: సీతంపేట ఏజెన్సీలో గిరిజన రైతులకు సాగు నీటి కష్టాలు తీరడం లేదు. చెంతనే ఎత్తిపోతల పథకం ఉన్నా.. వారికి తిప్పలు తప్పడం లేదు. గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం కారణంగా సాగునీటికి కటకటలాడాల్సి వస్తోంది. ఏటా వరుణుడిపైనే ఆధారపడి సాగు చేపట్టాల్సి వస్తోంది. వాస్తవంగా మండ పంచాయతీలో జక్కరవలస, రాయిమానుగూడ గ్రామాలకు చెందిన 70 మంది వరకు గిరిజన రైతులు ఎంగుపేట ఎత్తిపోతల పథకంపై ఆధారపడి సుమారు 100 ఎకరాల్లో సాగు చేపడుతున్నారు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో వరి, నువ్వులు, రాగులు, మొక్కజొన్న తదితర పంటలు పండిస్తున్నారు. 2016లో టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఈ ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించడంతో 2019 వరకు వారికి ఏ ఇబ్బందీ ఉండేది కాదు. పూర్తి స్థాయిలో సాగునీరు అందడంతో ఏటా మూడు పంటలు పండించేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన పరిస్థితి మారింది. ఎత్తిపోతల పథకం నిర్వహణను గత సర్కారు పూర్తిగా గాలికొదిలేసింది. సంబంధిత శాఖ అధికారులు కూడా పట్టించుకోవడం మానేశారు. దీంతో కొన్నాళ్లుగా గిరిజన రైతులు సాగునీటికి అష్టకష్టాలు పడుతున్నారు.

40 ఎకరాలకే నీరు..

వాస్తవంగా నాలుగేళ్ల కిందట ఈ పథకానికి ఉండే మూడు మోటార్లలో ఒకదానిని అప్పటి ఇరిగేషన్ అధికారులు ఇక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. మిగితా రెండు మోటార్లలో ఒకటి మరమ్మతుకు గురైంది. మిగిలిన ఒక మోటారు మాత్రమే పని చేస్తుంది. దీంతో ఈ పథకం నుంచి కేవలం 40 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుంది. మిగిలిన 60 ఎకరాలకు చెందిన గిరిజన రైతులు వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. సాగునీటి సమస్య కారణంగా ఈ ఏడాది ఎద పద్ధతిలో వరి సాగు చేపట్టారు. ఐదు నెలల కిందట 16 మంది గిరిజన రైతులు రూ.1500 చొప్పున ఎత్తుకొని మరమ్మతుకు గురైన మోటారును రిపేరు చేయించేందుకు ప్రయత్నించారు. అయితే ప్రయోజనం లేకపోయింది. డబ్బు ఖర్చయినా.. మోటారు బాగవలేదు. దీనిపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సాగునీరందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత గిరిజన రైతులు కోరుతున్నారు.

ఏపీఎస్ఐడీసీ కో ఆర్డినేటర్ ఏమన్నారంటే...

'ఎంగుపేట ఎత్తిపోతల పథకం నిర్వహణ, మోటార్ల మరమ్మతులను గిరిజన రైతులే చూసుకోవాలి. మేము కేవలం విద్యుత్ బిల్లు మాత్రమే కడతాం. ఇటీవల ఎంగుపేట ఎత్తిపోతల పథకాన్ని సందర్శించాం. అక్కడ నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి నివేదించాం.' అని ఏపీఎస్ఐడీసీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు.


ఎంగుపేట ఎత్తిపోతల పథకం


అరకొర సాగునీటితో గిరిజన రైతులు పండిస్తున్న వరి

గత ప్రభుత్వం స్పందించలే..



ఎంగుపేట ఎత్తిపోతల పథకంపై ఆధారపడి గిరిజన రైతులు ఏటా మూడు పంటలు పండించే వారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి గిరిజన రైతులకు అంకితం చేశారు. మూడేళ్ల పాటు ఈ ప్రాంతంలో రైతులు ఏటా వరి, నువ్వులు, చోడి వంటి పంటలను పండించుకునేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీన్ మారింది. ఈ పథకం నిర్వహణను గాలికొదిలేసింది. ఇప్పుడు రైతులు ఏడాదికి ఒక పంటనే పండిస్తున్నారు.

- సవర మంగయ్య, నీటి సంఘం అధ్యక్షుడు, జక్కరవలస

పూర్తిస్థాయిలో సాగునీరందించాలి..



వాబ గెడ్డ నుంచి ఎత్తిపోతల పథకానికి నీరు చేరుతుంది. అయితే ఈ పథకం నుంచి పూర్తిస్థాయిలో సాగునీరందించగలిగితే ఏటా మూడు పంటలు పండించుకుంటాం. దీనిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించాలి. గిరిజన రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి.

- సవర చిన్నారావు, గిరిజన రైతు, జక్కరవలస

ఆంధ్రజ్యోతి

నవ్య | చిత్రజ్యోతి

గురువారం • 19 సెప్టెంబరు 2024

cinema@andhrajyothy.com

హేమ కమిటీ లాంటిది అవసరం లేదు



ఐశ్వర్యా రాజేశ్

'పరిశ్రమలో ఇప్పటివరకూ నేను లైంగిక వేధింపుల బారిన పడలేదు. నాకు తెలిసినంతవరకూ తమిళ చిత్రపరిశ్రమలో అలాంటి ఘటనలు జరిగిన దాఖలాలు లేవు. కాబట్టి మాలీవుడ్‌లో ఏర్పాటు చేసిన హేమ కమిటీ లాంటిది కోలీవుడ్‌లో ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదనుకుంటున్నాను' అని దక్షిణాది నటి ఐశ్వర్యా రాజేశ్ అన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె పై వ్యాఖ్యలు చేశారు. ఒక వేళ నిజంగా ఎవరైనా లైంగిక వేధింపుల బారిన పడితే, దానికి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి, మహిళల రక్షణే ముఖ్యం అని ఐశ్వర్య చెప్పారు.



మరో కథానాయిక శ్రద్ధా శ్రీనాథ్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ తాను లైంగికవేధింపుల బారిన పడలేదని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. "ఎనిమిదేళ్ల వయసు నుంచే జాగ్రత్తగా ఉండడం నేర్చుకున్నాను. నా చుట్టూ ఏం జరుగుతుందో గమనిస్తూ ఉండేదాన్ని. అప్రమత్తతో ఉండడం వల్లే నాకు వేధింపులు ఎదురుకాలేదు. మలయాళ చిత్రపరిశ్రమలో చాలా సినిమాలు చేశాను. అక్కడ మంచి వాతావరణమే ఉంది. పరిశ్రమలో కన్నా బయట ఎక్కువ నేరాలు జరుగుతున్నాయి. అక్కడ మహిళలకు రక్షణ కరవైందని' శ్రద్ధా శ్రీనాథ్ అన్నారు.

న్యాయం జరగాలి : అనసూయ



లైంగిక వేధింపులు ఎదుర్కొన్న మహిళలు ఎవరికీ భయపడకుండా, వెంటనే బయటపెట్టాలని నటి అనసూయ సూచించారు. జానీ మాస్టర్ చేతిలో లైంగిక వేధింపులకు గురైన మహిళా కొరియోగ్రాఫర్‌తో పలు సందర్భాల్లో కలసి పనిచేసినట్లు ఆమె సోషల్ మీడియాలో తెలిపారు. 'పుష్ప' చిత్రం సెట్స్‌లో ఆమె పనితీరు చూశాను, ప్రతిభావంతురాలు అని కితాబునిచ్చారు. ఆమెకు న్యాయం జరగాలని అనసూయ ఆకాంక్షించారు. మహిళలపైన సానుభూతి చూపడానికి పరిమితం కాకుండా వారికి అండగా నిలవాలని ఆమె ప్రజలను కోరారు.



ఎన్టీఆర్ కథానాయకుడిగా శివ కొరటాల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'దేవర' చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. బుధవారం ఎన్టీఆర్, జాన్వీకపూర్ రొమాంటిక్ లుక్‌ను విడుదల చేసింది.

విన్నవెంటనే ఆకట్టుకునేలా...



విష్వక్ సేన్, మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. అక్టోబరు 31 విడుదలవుతున్న ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'ఓ పిల్లా'ను మేకర్స్ విడుదల చేశారు. విన్న వెంటనే ఆకట్టుకునేలా ఉన్న ఈ రొమాంటిక్ సాంగ్‌కు జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు. కృష్ణ చైతన్య లిరిక్స్ అందించగా.. నకాశ్ అజీజ్ ఆలపించారు.

గుర్రం పై యోధుడు



కన్నడ కథానాయకుడు ఉపేంద్ర నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యూ ఐ ద మూవీ'. ఉపేంద్ర దర్శకత్వం వహిస్తున్న పదకొండో సినిమా ఇది. ఆయన కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి కేపీ శ్రీకాంత్ నిర్మాత. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. గుర్రం పై యోధుడి గెటప్‌లో ఉన్న ఆయన లుక్ అదిరింది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ సినిమాను అక్టోబర్‌లో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు చెప్పారు. రీష్మా నాయక్, నిధి సుబ్బయ్య, మురళీశర్మ, రవిశంకర్ ఇతర ముఖ్య తారాగణం.

ప్రశంసలు ఆనందాన్నిస్తున్నాయి



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్ర లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవలే విడుదలై సక్సెస్‌ఫుల్‌గా థియేటర్లలో రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరో దిలీప్ ప్రకాశ్ మాట్లాడుతూ "ఈ సినిమాకు సూపర్‌హిట్ టాక్‌తో పాటు మంచి కలెక్షన్లు కూడా వస్తున్నాయి. ఈ రెస్పాన్స్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు. "నాటక రంగం నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాను ఇంతటి హిట్ చేసినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ సినిమాని చూసిన వారంతా ప్రశంసిస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది" అని దర్శకుడు అర్జున్ సాయి అన్నారు.

జర్నీ... మరోసారి



శర్వానంద్, అనన్య, జై, అంజలి ప్రధాన పాత్రలు పోషించిన అనువాద చిత్రం 'జర్నీ' 2011లో విడుదలై సంచలన విజయం సాధించింది. రెండు ప్రేమ కథలను సమాంతరంగా చూపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకొంది. ఇప్పుడు టాలీవుడ్‌లో రీ రిలీజ్ చిత్రాల ట్రెండ్ ఉంది కనుక సుప్రియ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్ష్మి నరసింహా మూవీస్ ఈ మ్యూజికల్ లవ్‌స్టోరీని ప్రేక్షకుల ముందుకు తెస్తోంది. ఈ నెల 21న 'జర్నీ' సినిమాను రీ రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు.

ఊహించిన దాని కంటే పెద్ద హిట్

నితేశ్‌రాణా దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'మత్తువదలరా 2'. శ్రీ సింహకోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకున్న సందర్భంగా దర్శకుడు నితేశ్‌రాణా మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా విజయం ఇచ్చిన ఉత్సాహం ఒక వైపు.. చిరంజీవి, మహేశ్‌బాబు అందించిన ప్రశంసలు మరో వైపు.. ఎంతో సంతోషాన్ని ఇస్తున్నాయి.



ఈ సినిమా మా చిత్రబృందం ఊహించిన దాని కంటే పెద్ద విజయాన్ని సొంతం చేసుకోవడంతో టీమ్ అంతా హ్యాపీగా ఉంది. ఈ సినిమాకు శ్రీ సింహకోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా హ్యూజ్ అస్సెట్‌గా నిలిచారు. కాలభైరవ ఇచ్చిన సంగీతాన్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సినిమాలోని పాత్రల్ని జనరంజకంగా మలిచేందుకు ఎన్నో రిఫరెన్స్‌లు తీసుకున్నాను. ఇంకో సినిమా చేయడానికి సన్నాహాలు చేసున్నాను. ఆ తర్వాతే 'మత్తు వదలరా 3' ఉంటుంది.

మంచి విజయం సాధించాలి



'పిల్ల పిలగాడు' ఫేమ్ సాయి తేజ, పావని కరణం హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'పైలం పిలగా'. ఆనంద్ గుర్రం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను రామకృష్ణ బొద్దుల, ఎస్.కే. శ్రీనివాస్ నిర్మించారు. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా టీజర్, ట్రైలర్‌ను చూసి హీరో బాలకృష్ణ ప్రశంసించారు. 'ఈ సినిమా కంటెంట్ బాగుంది. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

కొత్తగా...

అద్భుతమైన విజువల్స్‌తో...



నటుడు రవిశంకర్ దర్శకుడిగా పరిచయమౌతున్న చిత్రం 'సుబ్రమణ్య'. ఆయన తనయుడు అద్వయ్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. అత్యున్నత సాంకేతిక విలువలతో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియం నిర్మిస్తున్నారు. ఈ సినిమా గ్లింప్స్ ఇటీవలే విడుదలైంది. అద్భుతమైన విజువల్స్‌తో నిండిన ఈ సినిమా గ్లింప్స్ అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

రెట్టింపు వినోదం

యువ నటీనటులు, సాంకేతిక నిపుణలతో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించిన 'మ్యాడ్' చిత్రం లాస్టియర్ విడుదలై హిట్ అయింది. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు.



ఈ సినిమాకు సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' వస్తోంది. ఇందులోని తొలి పాటను ఈ శుక్రవారం విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, సంప్రదాయ దుస్తుల్లో ఉన్న మ్యాడ్ గ్యాంగ్ పోస్టర్‌ను విడుదల చేసింది 'సితార' సంస్థ. ఈ సీక్వెల్‌ను మరింత వినోదాత్మకంగా మలిచే పనిలో దర్శకుడు కల్యాణ్ శంకర్ ఉన్నారు. రెట్టింపు వినోదంతో, రెట్టింపు విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంటామని నిర్మాతలు హారిక సూర్యదేవర, సాయి సౌజన్య చెప్పారు. 'మ్యాడ్' చిత్రానికి పనిచేసిన సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికీ వర్క్ చేస్తున్నారు.

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) 2024



ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకునే వారికి ప్రతి సంవత్సరం సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ప్రతి ఏడాది రెండుసార్లు జరుగుతుంది. పరీక్షను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తుంది. తాజాగా డిసెంబరు 2024 ఏడాదికి సంబంధించి నోటిఫికేషన్ వెలువడింది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అక్టోబరు 16 వరకు కొనసాగనుంది. డిసెంబరు 1న పరీక్షను ఓఎంఆర్ ఆధారితంగా నిర్వహించనున్నారు.

పరీక్ష విధానం: పరీక్ష మొత్తం రెండు పేపర్లు ఉంటుంది. మొదటి పేపరు ఒకటి నుంచి అయిదు తరగతులకు బోధించాలనుకునే వారికి, రెండో పేపరు ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోర్ జీవితకాలం వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. పరీక్షను 20 భాషల్లో నిర్వహిస్తారు. దీని స్కోరు కేంద్రప్రభుత్వం పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

అర్హతలు: పన్నెండో తరగతి, డిగ్రీ, డీఈఎల్‌ఈడీ/ డీఈడీ(ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య), బీఈఎల్‌ఈడీ/ బీఎస్సీఈడీ/ బీఏఈడీ/ బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ కేటగిరీలకు రూ.1000 (పేపర్-1 లేదా 2 మాత్రమే), రూ.1200(పేపర్ 1, 2 రెండూ). ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.500 (పేపర్ 1 లేదా 2 మాత్రమే), రూ.600 (పేపర్ 1, 2 రెండూ).

- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబరు 16
- **ఫీజు చెల్లింపునకు చివరి తేదీ:** అక్టోబరు 16
- **దరఖాస్తు సవరణ తేదీలు:** అక్టోబరు 21 నుంచి 25 వరకు
- **ఓఎంఆర్ ఆధారిత పరీక్ష:** డిసెంబరు 1
- **ఫలితాల వెల్లడి:** 2025 జనవరి
- **వెబ్‌సైట్:** https//ctet.nic.in/

దిక్సూచి

అడ్మిషన్స్

ఎన్‌ఎల్‌యూలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్‌ఎల్‌యూ) ఢిల్లీ 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు 'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025(ఏఐఎల్‌ఈటీ' నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు నవంబరు 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

కోర్సు, సీట్లు: యూజీలో అయిదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్) ప్రోగ్రామ్‌లో 120 సీట్లు, బీకాం ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్) నాన్ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో 60 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్(10+2) ఉత్తీర్ణులై ఉండాలి.

- పీజీ ప్రోగ్రామ్‌లో ఏడాది నాన్ రెసిడెన్షియల్ ఎల్‌ఎల్‌ఎం ప్రోగ్రామ్‌లో 80 సీట్లు, ఎల్‌ఎల్‌ఎం(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు ఎల్‌ఎల్‌బీ లేదా తత్సమానమైన లా డిగ్రీలో ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంఏ(ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో 25 సీట్లు ఉన్నాయి. సంబంధిత విభాగంలో అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- పీహెచ్‌డీ(లా, సోషల్ సైన్సెస్) ప్రోగ్రామ్‌కు 31 సీట్లు కేటాయించారు. అభ్యర్థులు ఎల్‌ఎల్‌ఎం/ మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానమైన డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలి.

ఎంపిక: ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2025 తదితరాల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.

దరఖాస్తు రుసుము: రూ.3500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1,500)

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** నవంబరు 18
- **అడ్మిట్ కార్డుల జారీ:** నవంబరు 28
- **ప్రవేశపరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in/

ఎస్పీని కలిసిన విజిలెన్స్ ఎస్పీ

విజయనగరం క్రైం: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల విజిలెన్స్ ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బర్ల ప్రసాదరావు బుధవారం ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 1989 బ్యాచ్ సబ్ ఇన్‌స్పెక్టరుగా పోలీసు శాఖలో విశాఖ రేంజ్‌లో ఎంపికైన ప్రసాదరావు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం రూరల్, సీటీలో వివిధ హోదాల్లో పనిచేశారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలోని టెక్ వర్స్ పోస్టల్ సెక్యూరిటీ విభాగంలోనూ, విశాఖపట్టణంలోనూ ఏసీపీగాను, అదనపు ఎస్పీగా పనిచేసి, ఇటీవల నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి పొందారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్సు ఎస్పీగా నియమించగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

వేపాడ: హెచ్ఐవీ-ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులపై వివక్ష చూపరాదని, వారిని అందరితో కలిసి జీవించేలా చూడాలని బొద్దాం గ్రామ సర్పంచ్ యర్రా రామసత్యవతి అన్నారు. మండలంలోని బొద్దాం గ్రామంలో బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొని ప్రసంగించారు. హెల్త్ అసిస్టెంట్ సంతోషి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

రేపు విద్యుత్ కోత

లక్కవరపుకోట: మండల కేంద్రంలో గల ప్రధాన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాను ఉదయం నిలిపివేస్తున్నామని విజయనగరం రూరల్ ఈఈ సురేష్‌బాబు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్

శృంగవరపుకోట: శృంగవరపుకోట మండలంలో ఈ నెల 20, 21 తేదీల్లో స్కూల్ గేమ్స్ నిర్వహణ ఉంటుందని ఎంఈవోలు ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, కోకో, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నారాయణ కేంబ్రిడ్జీ, కౌమది పాఠశాలల్లో ఈ క్రీడలు ఉంటాయన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణ

బాడంగి: మండలంలోని వాడాడ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నీటి సరఫరా నిలిచిపోవడంతో సర్పంచ్ ప్రతినిది పూడి సూర్యనారాయణ పినాఎంకి నుంచి వాడాడ వస్తున్న పైపులైనుకు స్కూల్ వద్ద మరమ్మతులు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించారు. పాఠశాల హెచ్ఎం సుందరరావు ఇటీవల ఈ విషయాన్ని పంచాయతీ అధికారులకు తెలియజేయగా వీఆర్వో, కార్యదర్శి, సర్పంచ్‌ల దృష్టికి తీసుకువెళ్లి పనులు చేయించారు.

రాష్ట్ర పండగగా ప్రకటించడం హర్షణీయం

రాజాం రూరల్: విశ్వకర్మ జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండగ్గా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షణీయమని తెదేపా నాయకుడు కోండ్రు జగదీష్ తెలిపారు. విశ్వబ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. విశ్వ కర్మ జయంతి సందర్భంగా పట్టణంలోని కస్పావీధిలో బుధవారం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో పాల్గొన్నారు.

సీఐటీయూ నుంచి రామ్మూర్తినాయుడి తొలగింపు

రాజాం రూరల్: సీఐటీయూ జిల్లా కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్.రామ్మూర్తినాయుడిని సంఘంతో పాటు ఇతర అన్ని బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 1న నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు, ఈనెల 17న సీటూ జిల్లా కమిటీ సైతం తొలగించాలని నిర్ణయించడంతో ఈ చర్య తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఇదే విషయాన్ని రామ్మూర్తి నాయుడితో ఆంధ్రజ్యోతి ప్రస్తావించగా.. నాపై నిరాధారమైన ఆర్థిక ఆరోపణలు మోపడం, సంఘం నుంచి ఎందు కు తొలగించకూడదూ అంటూ ఉద్దేశపూర్వకంగా ప్రశ్నించ డం అనైతికమని వాపోయారు.

ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలి

రేగిడి: ప్రతి ఒక్కరూ భక్తిభావం, ఆధ్యాత్మక జీవనం వైపు అడుగులు వేయాలని గుంటూరు జిల్లా నంబూరు కాశీ వనాశ్రమం పీఠాధిపతి శ్రీనివాసరామానుజ దాస్, ప లువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలో రేగిడి దత్తపీఠంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా దత్తగురువు కిమిడి సత్యనారాయణ అధ్యక్షతన దత్తజ్ఞాన మహాసభ నిర్వహించారు. ఈసభకు పలువురు హాజరై మాట్లాడారు.

సేవలకు సత్కారం

బొబ్బిలి రూరల్: మండలంలోని చింతాడ గ్రామంలో బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని దీవెనమ్మ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మెట్టవలస ఉన్నత పాఠశాల ఆంగ్ల బోధకులు బారు వేణును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. మరెన్నో ప్రశంసలు, అవార్డులు అందుకోవాలని జేసీ రాజు కోరారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యజ్జల మోజేస్ 2024-25 సంవత్సరానికి గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న సందర్భంగా బుధవారం స్కూల్ కాంప్లెక్స్ ఛైర్‌పర్సన్ నిర్మలాదేవి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీనివాసు, యూటీఎఫ్ కార్యదర్శి శ్రీనివాసు, ఏపీటీఎఫ్ కార్యవర్గ సభ్యులు సన్యాసినాయుడు, భాను ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణదాసు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

నవంబరులో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు

బొబ్బిలి: ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు విజయనగరంలో నవంబరు 27 నుంచి 30 వరకు జరుగుతాయని ఆ సంస్థ జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. స్వామి వారివీధిలో బుధవారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నవంబరు 27 న విజయనగరంలో విద్యార్థులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయని, ఈ కార్యక్రమాలలో ఏఐఎస్ఎఫ్ జాతీయ నాయకులు పాల్గొంటారన్నారు.

పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు

- రాజాం, రామభద్రపురంలో కేంద్రాలు
- మద్దతు ధర క్వింటాకు రూ.7,521
- జేసీ సేతు మాధవన్



మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

కలెక్టరేట్, సెప్టెంబరు 18: జిల్లాలో పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. తన చాంబరులో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1574హెక్టార్లలో పత్తి సాగవుతోందని, ఈనెల 23లోగా ఈ- క్రాప్ పూర్తి చేయాలని, నవంబరు రెండోవారం నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రాజాం, రామభద్రపురంలో కేంద్రాలను ప్రారంభించాలని, ఆ లోగా వాటికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది క్వింటాకు రూ.7,521గా మద్దతు ధరను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్ణయించిందన్నారు. తేమ నిర్ణీత శాతం కంటే ఎక్కువగా ఉన్నట్లయితే, శాతం ప్రకారం మద్దతు ధర క్రమంగా తగ్గుతుందని వివరించారు. తేమ శాతం ఎక్కువ ఉంటే కొనుగోలు చేయడం కుదరదని, అందువల్ల రైతులు పత్తి పంటలో తేమ ఎక్కువ లేకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలో సుమారు 1900 మెట్రిక్ టన్నుల పత్తి పండే అవకాశం ఉందని, ఈమేరకు కొనుగోలుకు గోదాములకు ఏర్పాటు చేయాలన్నారు. పత్తి పండించే రైతులకు నష్టం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ బి.రవికుమార్, వ్యవసాయాధికారి వీటీ రామారావు, జిల్లా అగ్ని మాపకాధికారి రామప్రసాద్, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పీవీ రంగారెడ్డిలు పాల్గొన్నారు.

ధైర్య సాహసాలే పోలీసు శాఖకు అవసరం: ఎస్పీ



కానిస్టేబుల్ కృష్ణని అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 18: జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కృష్ణ కనబరిచిన ధైర్యసాహసాలను ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రం అందించారు. గత నెల 24న నగరంలోని ఫూల్‌బాగ్ కాలనీ పీజీ కళాశాల సమీపంలో కొంత మంది యువకులు గంజాయి సేవించి మత్తులో చుట్టు పక్కల ప్రజలకు ఇబ్బంది కలుగజేస్తున్నట్టు డయల్-100 కి సమాచారం అందింది. దీంతో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు టూటౌన్ పోలీసు స్టేషన్‌కానిస్టేబుల్ కృష్ణ, హెచ్‌సీ జనార్దన్‌రావు ఘటన స్థలానికి చేరుకుని గంజాయి మత్తులో ఉన్న యువతను నియంత్రించేందుకు ప్రయత్నించగా, వారు పోలీసులపై దాడికి ప్రయత్నించారు. కానిస్టేబుల్ కృష్ణ, వారిని ఎదుర్కొని గంజాయి మత్తులో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. విధి నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సమర్థంగా వ్యవహరించిన కానిస్టేబుల్‌ను తన కార్యాలయానికి పిలిపించి బుధవారం అభినందించి, ప్రశంసాపత్రం అందించారు.

పేదోళ్ల ప్రయాణాలను సులభతరం చేయాలి



రైల్వేస్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

బొబ్బిలి: రైళ్లలో పేదోళ్ల ప్రయాణాలను సులభతరం చేయాలని, సౌకర్యవంతంగా మలచాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు పి.శంకరరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇటీవల ధనికవర్గాలను మాత్రమే దృష్టిలో పెట్టుకొని రైళ్లను ప్రవేశపెడుతూ ప్రచార ఆర్భాటాలు చేస్తోందన్నారు. బొబ్బిలి, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి విశాఖ, విజయనగరం తదితర ప్రాంతాలకు ప్రతిరోజూ వేలాదిమంది రాకపోకలు సాగించడానికి నరకయాతన పడుతున్నారన్నారు. లగ్జరీ, ఏసీ రైళ్లలో ప్రయాణం చేసే స్తోమతు లేని వారు ప్యాసింజరు రైళ్లను ఆశ్రయిస్తున్నారని, ఆ రైళ్ల సంఖ్య ప్రయాణికుల అవసరాలను ఏమాత్రం తీర్చలేకపోతుందన్నారు. సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు రెండే ఉంటున్నాయని, వాటిల్లో కాలుపెట్టడానికి ఏమాత్రం చోటు ఉండదన్నారు. సాలూరు నుంచి బొబ్బిలి మీదుగా రైలు నడుపుతున్నట్లు రెండేళ్ల క్రితం అధికారులు ప్రకటించారని, ఇప్పటికీ ఆ రైలుకు అతీ గతీ లేదన్నారు. రైల్వే సాధారణ ప్రయాణీకుల సమస్యలన్నిటినీ తీర్చే విధంగా అందరి ప్రజాప్రతినిధులపై అన్ని వర్గాల వారు తీవ్ర ఒత్తిడి తీసుకురావాలని శంకరరావు పిలుపునిచ్చారు. అనంతరం రైల్వే స్టేషన్ మాస్టర్ సుధాకర్ యాదవ్‌కు రైలు ప్రయాణికులు వినతిపత్రం సమర్పించారు. రైల్వే డీఆర్ఎంకు ఈ సమస్యలను నివేదించాలని ఆయన కోరారు. సీపీఎం నాయకులు ఎస్.గోపాలం, శేషగిరి, ఎస్ఎఫ్ఐ నాయకులు మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ వివరణ కోరిన డీసీహెచ్ఎస్

- ఎస్‌కోట ప్రాంతీయ ఆసుపత్రి పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక

శృంగవరపుకోట: 'సేవల్లో పేరగని స్థాయి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) రాజ్యలక్ష్మి స్పందించారు. శృంగవరపుకోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలను వివరణ అడిగారు. ఇదే విషయాన్ని పత్రికలకు, జిల్లా కలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కార్యాలయానికి నివేదించారు. సూపరింటెండెంట్ డాక్టర్ నీల ఇచ్చిన వివరణ ప్రకారం 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరించిన తరువాత అన్ని విషయాల్లోను వైద్య సేవలను పూర్తిగా అందిస్తున్నామని, ఆసుపత్రిలోని సమస్యలపై ఉన్నతాధికారులకు సమాచారం అందించామని, ఇబ్బందులు తెలియజేశామన్నారు. ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తియితే రోగులకు, సిబ్బందికి మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పాలి

వేపాడ: విద్యార్థులకు అర్థమయ్యేలా రోజూ మంచి కథలు చెప్తూ బోధన కొనసాగించాలని ఎంఈవో జగదీశ్వరరావు అన్నారు. మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ పాఠశాలల్లో బుధవారం రెండో రోజు నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వేపాడ జెడ్పీ పాఠశాలలో నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారి- 2 బాలభాస్కరరావు సందర్శించారు. నీలకంఠరాజపురం జెడ్పీ పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం డి.కన్నయ్య ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పిడుగు పాటు మృతులకు ప్రభుత్వ సాయం

కలెక్టరేట్: మూడు సంవత్సరాల క్రితం జిల్లాలోని పిడుగు పాటుకు మృతి చెందిన నాలుగు కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ప్రభుత్వం బుధవారం జీవో విడుదల చేసింది. ఒక్కొక్క కుటుంబానికి రూ. 4లక్షలు చొప్పున, నాలుగు కుటుంబాలకు మొత్తం రూ.16 లక్షలు విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. గత సంవత్సరాల్లో ప్రకృతి విపత్తు వల్ల మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందలేదు. అయా కుటుంబాలు తీవ్ర నిరాశలో ఉన్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బాధితులకు ఆర్థిక సాయం అందించేందుకు ఉత్తర్వులు ఇచ్చింది.

సామూహిక హారతి నీరాజనాలు

బొబ్బిలి రూరల్: పెంట గ్రామంలో బుధవారం శ్రీఅన్నపూర్ణసహిత నగరేశ్వర స్వామి దేవాలయంలో భాద్రపద శుక్ల పౌర్ణమి, దేవశిల్పి శ్రీవిరాట్‌విశ్వకర్మ జయంతి వేడుకల సందర్భంగా సమరసతసేవా ఫౌండేషన్ సంస్థ ధర్మప్రచారక్ ధూపం వాసు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలతో సామూహిక హారతి నీరాజనాలు సమర్పించారు.

కూటమి ప్రభుత్వంలో పల్లెలకు మహర్దశ



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సుధారాజు, ఎంపీపీ సోమేశ్వరరావు

శృంగవరపుకోట రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో పల్లెలకు మహర్దశ వచ్చిందని, సీఎం చంద్రబాబు పల్లెల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషిచేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇందుకూరి సుధారాజు అన్నారు. బుధవారం మండలంలోని తిమిడిలో ప్రారంభించిన పలు పనులకు శంకుస్థాపన పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ త్రినాథమ్మ, ఎంపీటీసీ పదాల ధర్మారావు, ఉప సర్పంచ్ బర్ల స్వామినాయుడు, వసి మాజీ సర్పంచ్ కారుకొండ వెంకటరావు, యువనాయకుడు ఒబ్బిన సతీష్, కార్యదర్శి రంగారావు ఉన్నారు.

ఈవ్‌టీజింగ్ చేస్తే కఠిన చర్యలు

రామభద్రపురం: విద్యార్థినులపై ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి రూరల్ సీఐ కే.నారాయణరావు హెచ్చరించారు. మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలపై లైంగిక దాడులకు పాల్పడినా కఠినమైన చర్యలు చేపడతామన్నారు. విద్యార్థులు కూడా సైబర్ మోసాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వంటివాటికి అలవాటు పడరాదని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో ఎస్ఐ వెలమల ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

లక్కవరపుకోట: పౌష్టికాహార మసోత్సవాల్లో భాగంగా బుధవారం కల్లేపల్లి గ్రామంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ రాజు ఆధ్వర్యంలో సచివాలయంలో బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించి పౌష్టికాహారం అందించారు. మహిళలు రక్తహీనత రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కే.పద్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.2.50 లక్షలు

రాజాం రూరల్: పట్టణంలోని నవదుర్గ అమ్మవారికి హుండీల ద్వారా 84 రోజులకు రూ.2,50,610 ఆదాయం సమకూరిందని ఈవో బలివాడ వెంకట మాధవరావు ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మకర్త, సిబ్బంది, పెద్దల సమక్షంలో బుధవారం హుండీలను తెరిచి లెక్కించినట్లు ఆయన వెల్లడించారు.

వరద బాధితులకు విరాళాలు

బొబ్బిలి రూరల్: విజయవాడ ప్రాంతంలో వరదల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు పట్టణంలోని వాసు విద్యాసంస్థల యజమానులు రౌతు రామమూర్తి, రౌతు వాసుదేవరావు కలిసి తమవంతుగా రూ. 1,16,116/-, తారకరామ కాలనీ అంబేద్కర్ యువజన సంఘం వారు తమవంతుగా రూ. 20,000/-.కుసుమూరు గ్రామస్థులు సీహెచ్ రామ్మూర్తినాయుడు, సూర్యనారాయణ, సింహాచలం, చిరంజీవి, టీడీపీ పెద్దలు కలిసి తమవంతుగా 50,000/-, బొబ్బిలి మండల టీడీపీ అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, ఎంపీటీసీ వెన్నెల నాగరాజు, టీడీపీ పెద్దలు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తమవంతుగా రూ. 73,000/-, గున్నతోటవలస గ్రామ సర్పంచ్ ఎస్ ఈశ్వరరావు, టీడీపీ పెద్దలు, కార్యకర్తలు రూ. 63,000/-. తెర్లాం మండలం గంగన్నపాడు గ్రామస్థులు తాడ్డి పోలినాయుడు, గేదెల రాంబాబు, కె తిరుపతి, ఈమండి అప్పారావు, ఎం శంకరరావు కలిసి రూ. 44,050/-, ఎం ఆర్ అగ్రహారం, కుమ్మరిపేట గ్రామాల పెద్దలు, కార్యకర్తలు కలిసి రూ.20,000/-, కూనాయవలస గ్రామస్థులు శంబంగి దాలినాయుడు, టీడీపీ పెద్దలు కలిసి రూ. 20,000/-, గొల్లాది టిడిపి పెద్దలు, కార్యకర్తలు కలిసి రూ. 43,000/-, గొర్లిసీతారాంపురం సర్పంచ్ గొర్లి ఈశ్వర ప్రసాదు రూ.20,000/-, ఆక్సిజన్‌వాలీ పార్టనర్స్ రాంబార్కి కిరణ్, యామల సత్యారావు, బంక పల్లి మోహనరావు కలిసి రూ.30,000/-, క్లాత్,రెడీమేడ్ మర్చెంట్స్ కలిసి రూ. 25,000/-, రంగరాయపురం గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి రూ 25,000/- విరాళంగా శాసన సభ్యులు బేబీనాయనకు కోటలో అందించారు.

రాజాం రూరల్: ఇటీవల సంభవించిన వరదలతో సర్వం కోల్పోయిన వారికి దాతల నుంచి ఆపన్నహస్తం అందుతోంది. ఇందులో భాగంగా పట్టణంలోని ది సన్ స్కూల్ హెచ్.ఎం. వై.భారతి రూ.30 వేలచెక్కును తెదేపా నాయకుడు, ఎమ్మెల్యే సోదరుడు కోండ్రు జగదీష్‌కు బుధవారం అందజేశారు. విద్యానికేతన్ కరస్పాండెంట్ గట్టి పాపారావు రూ.10 వేలు, ఈశ్వరనారాయణ కాలనీ సంక్షేమ సంఘ మాజీ అధ్యక్షుడు అల్లైన మురళీ, భానుప్రకాష్‌తో కలసి రూ.25 వేలు చెక్కును అందజేశారు.

చదువులో రాణించలేనని..

- ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య
- అంబాడవెంకటాపురంలో ఘటన



యోగేశ్వరరావు (ఫైల్)

రేగిడి: చదువులో రాణించలేకపోయానన్న మనస్తాపంతో గోగుల యోగేశ్వరరావు(21) ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అంబాడ వెంకటాపురం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, చదువులో లక్ష్యం చేరుకోలేకపోతున్నానని, తన మృతదేహానికి హైదరాబాద్‌లో ఉన్న సోదరుడు వచ్చేవరకు అంతిమసంస్కారాలు చేయవద్దని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. ఎస్ఐ నీలావతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబాడ వెంకటాపురం గ్రామానికి చెందిన గోగుల కామినాయుడు, సత్యవతి దంపతులకు ఇద్దరు పిల్లలు. చిన్నోడు యోగేశ్వరరావు రాజాంలో ఒక ప్రైవేటు కళాశాలలో ఇంజినీరింగ్ (సీఎస్ఈ) ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ప్రస్తుతం కళాశాల ట్రైనింగ్ కోసం విశాఖపట్నంలో ఉంటున్నాడు. రెండురోజుల క్రితం స్వగ్రామం వచ్చాడు. పలు కాంపిటేటివ్ ఎగ్జామ్స్, జేఈఈ మెయిన్స్ తదితర పరీక్షలు రాస్తున్నా అనుకున్నంత ప్రతిభ సాధించలేకపోతున్నానని తీవ్రంగా బాధపడుతున్నాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో రెండో అంతస్తులో ఒక్కడే నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారుజామున ఫ్యాన్ ఉక్కుకు ఉరేసుకున్నాడు. ఉదయం ఎంతకీ బయటకు రాకపోవడంతో పైకి వెళ్లి చూసిన తల్లిదండ్రులు కుమారుడు ఉరేసుకోవడాన్ని చూసి ఉన్నచోటే కూలిపోయారు. రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర, రేగిడి ఎస్ఐ నీలావతి అంబాడవెంకటాపురం చేరుకొని మృతదేహానికి శవపంచనామా చేశారు.

స్నానానికి దిగి..

- చెరువులో పడి వ్యక్తి మృతి

విజయనగరం క్రైం: విజయనగరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారిక గ్రామంలో ప్రమాదవసాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. సారిక గ్రామానికి చెందిన తోట సూరిబాబు(45) రాడ్ బెండింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి గ్రామంలోని చెరువుకు స్నానానికి వెళ్లాడు. చెరువులో ఈత కొడుతుండగా అందులో ఉన్న ఊబిలో కూరుకుపోయాడు. బయటకు రాలేకపోవడంతో ఊపిరి ఆడక మరణించాడు. మిగిలిన ముగ్గురు అతి కష్టమ్మీద ప్రాణాలతో బయటపడ్డారు. జరిగిన విషయాన్ని గ్రామ ప్రజలకు వివరించారు. వెంటనే గ్రామస్థులు చెరువులో వెదికినా ఆచూకీ లభించక పోవటంతో రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్.ఐ ఆశోక్ కుమార్, సిబ్బంది అక్కడకి చేరుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని ఘటనా స్థలానికి పిలిపించి గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం తోట సూరిబాబు మృతదేహాన్ని ఊబిలోంచి బయటకు తీశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

రామభద్రపురం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన ఏఎస్ఐ ఐవీ రమణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని వసంతుల వీధికి చెందిన పూడి చంద్రశేఖర్ (38) గత కొన్ని రోజులుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకుంటున్నప్పటికీ కుదుటపడకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం బాత్‌రూంలకు వాడే యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే బాడంగి సీహెచ్‌సీకి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతునికి భార్య రాజేశ్వరి, కుమార్తె రితికా, కుమారుడు మోక్షిత్ ఉన్నారని, మృతుడి తమ్ముడు రామకృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

వసంతలో పశువుల శాల దగ్ధం

గంట్యాడ: మండలంలోని వసంత గ్రామంలో చలుమూరి అప్పారావుకు చెందిన పశువుల శాలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీనికి సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతి రోజులా అప్పారావు మంగళవారం రాత్రి పశువులను శాల బయట కట్టి గడ్డి వేసి ఇంటికి వచ్చారు. తిరిగి బుధవారం ఉదయం అప్పారావు కళ్లం వద్దకు వెళ్లే సరికి పశువుల శాల కాలి బూడిదై ఉంది. బయట కట్టిన ఆవుల్లో ఒకదాన్ని శాలలో కట్టి నిప్పు పెట్టారు. అయితే ఆవుకు కట్టిన కర్ర విరిగిపోవడంతో మంటల్లో నుంచి బయట రావడంతో ఆవుకు ప్రమాదం తప్పింది. గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ కేసు నమోదు చేశారు. వెంటనే ఘటనా స్థలాన్ని డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంతో పరిశీలించారు. టీడీపీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు, మండల టీడీపీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, టీడీపీ నాయకులు జి.శ్రీనివాసరావు పరిశీలించారు.

యువకుల మధ్య ఘర్షణ.. ఒకరి మృతి

రామభద్రపురం: మండల పరిధిలోని బూసాయవలస నాయుడువలస గ్రామాలకు చెందిన యువకుల మధ్య ఘర్షణ ఒకరి మృతికి దారి తీసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాయుడువలసకు చెందిన ఉమ్మిరెడ్డి శ్రీను(48) సోమవారం సాయంత్రం బైక్‌పై నూనెడబ్బా తీసుకువెళ్తుండగా ముచ్చెర్లవలసకు చెందిన కొంత మంది యువకులు బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొన్నారు. దీంతో ఇరువురి మధ్య వాదన చోటుచేసుకుంది. ఈ క్రమంలో యువకులు శ్రీనును తీవ్రంగా గాయపరిచారు. దీనిపై మంగళవారం ఉదయం గ్రామ పెద్దలు ఇరు వర్గాల మధ్య రాజీ చేయడానికి ప్రయత్నించారు. అయితే శ్రీనుకు దెబ్బలు బలంగా తగలడంతో బుధవారం బాడంగి ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడికి భార్య మంగ, కుమార్తె పావని ఉన్నారు. దీనిపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

పాగిరిలో కాకతీయుల నాటి శిల్పాలు





నాగదేవత, కాకతీయ శిల్పసంపదను పరిశీలిస్తున్న దృశ్యం

రాజాం రూరల్: మండల పరిధిలోని పొగిరి గ్రామంలో వెయ్యేళ్ల నాటి కాకతీయుల నాటి శిల్పసంపద ఉందని, నాటిరోజుల్లో ఆ గ్రామం గొప్ప శైవక్షేత్రంగా వెలుగొందిందని రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాథం స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన పురాతన ఆధారాలున్నాయని వెల్లడించారు. గ్రామంలో ఉన్న పురాతన విగ్రహాలు, శిల్ప సంపద, ఇతర ఆనవాళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వెయ్యేళ్ల క్రితం పొగిరి శైవక్షేత్రమని, శక్తి స్థలమని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఈమని శివ నాగిరెడ్డి, తెలంగాణ చరిత్ర పరిశోధకుడు రామోజ్ హరగోపాల్ సైతం నిర్ధారించినట్లు ఆయన వివరించారు. గ్రామంలోని నాగదేవత శిల్పం, వెయ్యేళ్ల నాటి అగస్త్యేశ్వర ఆలయాన్ని పరిశీలించారు. గ్రామంలోని ఓ ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహం కాకతీయుల దేవత కాకతికి చెందిన సప్త మాతృకల్లోని ఛాముండిగా గుర్తించినట్లు తెలిపారు. గార సీతారత్నం, పారుపల్లి కిరణ్ తదితరులు గ్రామంలోని శిల్పసంపదను సందర్శించిన వారిలో ఉన్నారు.

అన్నదాతకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

బొబ్బిలి రూరల్: మండలంలోని కారాడ సచివాలయంలో బుధవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ గోపాలం, రైతులకు అన్నదాత పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతూ సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే అన్నదాత పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకూ అమలు చేయడం లేదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 2 నెలలు కావస్తున్న అమలు చేయకపోవడంతో రైతన్నలు అప్పులు చేసి పంటలను సాగు చేస్తున్నారని అన్నారు. రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం ఇవ్వాలని, 2 లక్షలు వరకు రుణమాఫీ చేయాలని, వర్షాలకు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. రైతు సంఘం నాయకులు తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు. ● **కొత్తవలస:** రైతులు, కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం, వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిమ్మలపాలెం గ్రామ సచివాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ప్రతి గ్రామ సచివాలయంలోనూ రైతులు, కౌలు రైతులు వినతిపత్రాలను అందజేస్తారని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు గాడి అప్పారావు తెలిపారు. నష్టపోయిన పంటలకు బీమా పరిహారం ఇవ్వాలని, రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ చేయాలన్నారు. రైతులు గొంప కృష్ణ మూర్తి, కె.శ్రీనివాసరావు, గొంప ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● **లక్కవరపుకోట:** మండలంలోని రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సచివాలయ అధికారులకు సీపీఎం నేతలు వినతిపత్రం అందజేశారు. రైతులకు, కౌలు రైతులకు సబ్సిడీలపై రుణాలు అందించాలని, రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని కోరారు. ఉచిత పంటల బీమా అమలు, యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు పరిహారం, రూ.20వేల పంటసాయం, తుఫానులో నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా నేత గాడి అప్పారావు, ఈశ్వరరావు, చంటి తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి రూరల్: కారాడ సచివాలయంలో వినతిపత్రమిస్తున్న రైతులు



కొత్తవలస సచివాలయంలో...



ఎల్‌కోట: వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట రూరల్: సీతంపేట ఐటీఐలో నాలుగో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మిగుల సీట్లకోసం ఆన్‌లైన్‌లో ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకో వచ్చని పేర్కొన్నారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం మూడుగంటల్లోగా ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో వివరాల మేరకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే ఐటీఐలో ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు ఈనెల 28న సీతంపేట ఐటీఐలో నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.

లక్ష్యాల పేరుతో వేధింపులు ఆపాలి

● పోస్టల్ జీడీఎస్, పోస్టుమెన్, ఎంటీఎస్ సంఘ సభ్యుల నిరసన



సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పార్వతీపురంటౌన్: లక్ష్యాల పేరుతో ఉద్యోగులపై వేధింపులుఆపాలని జిల్లా పోస్టల్ జీడీఎస్, పోస్టుమెన్, ఎంటీఎస్ సంఘ సభ్యులు డిమాండ్‌చేశారు. బుధవారం పార్వతీపురం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద సంఘ సభ్యులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆ సంఘ నాయకులు అప్పారావు, ఉమా శంకరరావు మాట్లాడుతూ రోజుకొక విధంగా పోస్టల్ ఉద్యోగులకు లక్ష్యాలు ఇవ్వడం విచారకరమన్నారు. పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని, ఎనిమిదో వేతన సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. 18 నెలల డీఏబకాయిలను వెంటనే చెల్లించాలని తెలిపారు. పోస్టల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వచ్చేనెల మూడు నుంచి ఐదో తేదీ వరకు ప్రధాన కార్యాలయాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. లక్ష్యాలను బహిష్కరిస్తూ వచ్చేనెల ఏడు నుంచి మూడురోజులపాటు సర్కిల్‌కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: ఆరోగ్యంగా ఉండేందుకు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ పీవో గొట్టాపు సుగుణకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని రావివలస ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని కారివలస అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీవో గొట్టాపు సుగుణకుమారి, సూపర్‌వైజర్లు రౌతు లక్ష్మి, అరుణకుమారి ఆధ్వర్యంలో హ్యాండ్‌వాష్ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్నపిల్లలచే హ్యాండ్‌వాష్ చేయించారు.అనంతరం పీవో సుగుణకుమారి మాట్లాడుతూ హ్యాండ్ వాష్‌ను ఒక అలవాటుగా మార్చుకోవాలని కోరారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రి పంచాయతీ కార్యదర్శి జె.శ్యామసుందరరావు విధులకు గైర్హాజరుకావడంతోపాటు, గ్రామస్థులపై దురుసుగా ప్రవర్తిస్తుండడంతో చర్యలు తీసుకోవాలని పంచాయతీకి చెందిన చింత ఉమామహేశ్వరరావు, నివర్తి శశికుమార్, అలజంగి కృష్ణం నాయుడు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీ ఎం.నాగభూషణరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు.



ఈవోపీఆర్డీకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఆట్యా-పాట్యా పోటీలకు బొడ్డవలస విద్యార్థి



బెస్ట్ ఎమర్జింగ్ టీం అవార్డు లభించడంతో అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సాలూరు రూరల్: బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకులం ఇంటర్ విద్యార్థి వాసు పాండిచ్చేరిలో నవంబరులో జరగనున్న జాతీయ స్థాయి ఆట్యా-పాట్యా క్రీడా పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, ఫిజికల్ డైరెక్టర్ విద్యాసాగర్‌లు చెప్పారు. బుధవారం పాఠశాలలో వారు విలేకరులతో మాట్లాడుతూ కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి తొమ్మిదో జూనియర్ బాలబాలికల ఆట్యా-పాట్యా పోటీల్లో జిల్లా జట్టుకు బెస్ట్ ఎమర్జింగ్ టీం అవార్డు దక్కిందన్నారు.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి వాసు నవంబరు ఐదు నుంచి ఏడో తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆట్యా-పాట్యా పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులను అంబేడ్కర్ గురుకుల కో ఆర్డినేటర్ ఫ్లోరెన్స్ , పీఈటీ నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

కులూమనాలి క్యాంపునకు సాలూరు విద్యార్థి ఎంపిక

సాలూరు: సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం బీఏ చదువుతున్న వంతల వరుణ్ కుమార్ కులూమనాలిలో జరిగే జాతీయ సమైక్యతా క్యాంపునకు ఎంపికైనట్లు బుధవారం ప్రిన్సిపాల్ కె.ఉషశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయసేవా పథకం నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎంపికకావడంపై ప్రిన్సిపాల్‌తో పాటు ఎన్ఎస్ఎస్ పీవో చిరంజీవులు సిబ్బంది అభినందించారు.



వరుణ్‌కుమార్

పాలకొండ-హడ్డుబంగి రోడ్డులో శ్రమదానం

సీతంపేట రూరల్: సీతంపేట ఐటీడీఏ ప్రధాన గేటు ఎదురుగా ఉన్న పాలకొండ-హడ్డుబంగి ప్రధానరహదారిపై యువకులు శ్రమదానం చేశారు. ఇక్కడ ఏర్పడిన గోతులను వైసత్యన్నారాయణ, చిన్న, బిగోపాల్, జిప్రమీలసంజీవ్ తదితరులు పూడ్చారు.ఇక్కడ ఏర్పడిన గోతుల వల్ల వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు.

కౌలు రైతులకు జాబ్‌కార్డులు ఇవ్వాలి

పాలకొండ: గిరిజన రైతులకు భూములివ్వాలని, కౌలు రైతులకు జాబ్‌కార్డులు ఇవ్వాలని అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం, సీపీఎంఎల్ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు భాస్కరరావు, విఠలేశ్వరరావు, డి.సూర్యకళ, వి.రామయ్య, సూర్యారావు, నాగేశ్వరరావు జగన్, ఆదినారాయణ, సత్యం డిమాండ్ చేశారు. బుధవారం పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీనిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడవులను మైనింగ్‌మాఫియాలకు కట్టబెట్టడానికి చూస్తున్నాయని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు.



తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

● జిల్లాలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో అధికారుల పిలుపు



గరుగుబిల్లి: రావివలసలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



మక్కువ: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు



పాలకొండ: మొక్క నాటుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలో స్వచ్ఛతాహీసేవ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: జిల్లాలో స్వచ్ఛతాహీసేవా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు పురపాలక సంఘాల పరిధిలోని వార్డులు, పంచాయతీల్లో వివిధ కార్యక్రమాలు సచివాలయసిబ్బంది చేపట్టారు. గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు, తుప్పలు శుభ్రంచేయడం, కాలువలు శుభ్రం చేయడం, బ్లీచింగ్ స్ప్రేయింగ్ కార్యక్రమాలను చేపట్టారు. వైద్య ఆరోగ్యశాఖ పలు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించింది.

●**పాలకొండ:** మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీడీవో ఉమామహేశ్వరి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెలగవాడ పంచాయతీ సిరికొండలో స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు.

● **వీరఘట్టం:** మండలంలోని చిదిమిలో స్వచ్ఛతాహీసేవ కార్యక్రమంలో భాగంగా వాటర్ ట్యాంకులు క్లోరినేషన్, వీధుల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు.వీధులను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పంచాయతీ సెక్రటరీ జె.భరత్‌కుమార్ గ్రామస్థులకు సూచించారు.

●**మక్కువ:** మక్కువ ఆర్‌సీఎం వీధిలో గల మురుగుకాలువల్లో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగాచెత్తను తొలగించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవో ఎల్.అప్పలశివరామమ్, కార్యదర్శి సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●**గరుగుబిల్లి:** గ్రామాల్లో వ్యాధులు నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావులు సూచించారు. గరుగుబిల్లిలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత పరుగులుతో పాటు దోమల నివారణకు అవసరమైన పిచికారీ నిర్వహించారు.కాగా రావివలసలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి నాగభూషణరావు, సర్పంచ్ బి.అప్పడు, ఎంపీటీసీ కోట భరత్‌కుమార్, కార్యదర్శి ఆర్.శశిభూషణరావు,కిశోర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జీవో-85ను రద్దు చేయాలి

● పీహెచ్‌సీల్లో వైద్యులు లేక రోగులకు అందని సేవలు

జీవో-85ను వెంటనే రద్దు చేయాలని పీహెచ్‌సీల వైద్యాధికారులు చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లడంతో బుధవారం రోగులు ఇబ్బందిపడ్డారు. పీహెచ్‌సీల రాష్ట్ర వైద్యుల సంఘం పిలుపుమేరకు విధులకు హాజరుకావడంలేదు. దీంతో స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు సేవలందిస్తున్నారు.

భామిని: భామిని పీహెచ్‌సీలో రోగులు ఇబ్బందిపడుతున్నారు.జీవో-85ను వెంటనే రద్దు చేయాలని వైద్యాధికారులు నిరసన తెలుపుతుండడంతో బుధవారం పీహెచ్‌సీకి వచ్చిన 80మంది రోగులకు స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, సిబ్బంది రక్త పరీక్షలతో చేయడంతో పలు పరీక్షలుచేశారు. మెరుగైన వైద్యం కోసం సీతంపేట పంపించారు.

●**గరుగుబిల్లి:** పీహెచ్‌సీల్లో వైద్యులు నిరసన తెలుపుతుండడంతో రోగులకు వైద్య సేవలు అందక ఇబ్బందిపడుతున్నారు. పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో ఇన్ సర్వీస్ కోటాను కుదించడంపై వ్యతిరేకిస్తూ వైద్యులు విధులకు హాజరుకావడం లేదు. ఈనెల 13 వరకు పీహెచ్‌సీల పరిధిలో నల్ల బ్యాడ్జీలను ధరించి సేవలందించేవారు. ఈనెల 15న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించిన విషయం విదితమే.ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో వైద్యులు విధులకు గైర్హాజరవుతున్నారు. ఈనేపథ్యంలో గరుగుబిల్లి పీహెచ్‌సీల్లో వైద్యులు సమ్మె వల్ల విధులకు హాజరుకాకపోవడంతో దిగువస్థాయి సిబ్బందే చికిత్సలు అందిస్తున్నారు. వైద్యులు వస్తారని నిరీక్షణ చేసి తదుపరి సిబ్బందిచే సేవలు పొందుతున్న పరిస్థితి నెలకొంది. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అధిక సంఖ్యలో రోగులు తరలివచ్చినా అనంతరం తిరుగు ముఖం పట్టారు.



భామిని: వైద్యసేవల కోసం నిరీక్షిస్తున్న రోగులు

●**వీరఘట్టం:** మండలంలోని వీరఘట్టం, బటివాడ పీహెచ్‌సీల్లో వైద్యులు చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లడంతో రోగులు ఇబ్బందులకు గురయ్యారు. జీవో -85 రద్దు చేయాలని వైద్యులు కొద్ది రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

వీరఘట్టం: మండలంలోని కిమ్మి సమీపంలో పంట పొలాల వద్ద ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించారు. మంగళవారం ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ శీర్షికతోఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో విద్యుత్ అధికారులు బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు.

అంగన్‌వాడీ కార్యకర్త తొలగింపు

సాలూరు: పట్టణంలోని రామాకాలనీలో అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త బలగ రాధను విధుల నుంచి తొలగించినట్లు సీడీపీవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామాకాలనీ మూడో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించాలని క్రిస్టియన్ కాలనీకి చెందిన కార్యకర్త పార్వతీకి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. బలగ రాధపై వచ్చిన అనేక అభియోగాలకు సంబంధించి ఉన్నతాధికారులు విచారణచేశారని తెలిపారు. సమాచారం లేకుండా కేంద్రాన్ని రెండో శనివారం తెరవకపోవడంతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తగా ఉంటూ స్ఫూర్తి మహిళా మండలి స్వచ్ఛంద సంస్థను నిర్వహించడం, కార్యకర్తల నుంచి ప్రతినెల డబ్బులు వసూలు చేయడంవంటి ఆరోపణలు వాస్తవమని తెలియని పేర్కొన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు మంగళవారం రాధను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

ట్యూబ్‌లైట్ల వితరణ

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ ప్రీమెట్రిక్ బాలికల వసతి గృహానికిబ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర పార్వతీపురం బ్రాంచ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపు మేరకు రూ.17,800 విలువచేసే పది పంకాలు, 20 ట్యూబ్ లైట్లు అందించింది. ఈ సందర్భంగా జిల్లా షెడ్యూల్డ్ కులాలు, సంక్షేమం, సాధికారిత అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ సీఎస్ఆర్ నిధులతో పంకాలు, లైట్లు అందజేసిన మహారాష్ట్ర బ్యాంకు, జిల్లా యంత్రాంగానికి అభినందించారు.

వీరఘట్టంలో అన్నదానం

వీరఘట్టం: వీరఘట్టం మందిరం వీధిలో వినాయక ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వీరఘట్టం పట్టణ నాయకులు బల్లా హరిబాబు పాల్గొన్నారు.

గ్రానైట్ తరలిస్తే చర్యలు

భామిని: బురజోల కొండలో యంత్రాలతో తవ్వి గ్రానైట్‌ను తరలిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖరం తెలిపారు. పాలకొండ సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు. వీఆర్వో, వీఆర్ఏలకు పర్యవేక్షణ బాధ్యత ఇచ్చినట్లు తెలిపారు.

రైల్వే లైను కోసం స్థల పరిశీలన

గజపతినగరం: రైల్వే మూడోలైను పనులకు సంబంధించి జేసీ సేతుమాధవన్ బుధవారం స్థలాన్ని పరిశీలించారు. గజపతినగరం రైల్వేస్టేషన్ నుంచి జాతీయ రహదారికి వరకు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మరుపల్లి రెవెన్యూ పరిధిలోరాబంద రైల్వే గేటువద్ద మూడోలైన్‌కు ఆనుకొని ఉన్న స్థలాన్ని పరిశీలించారు.

అర్థమయ్యేలా బోధించాలి: డిప్యూటీ డీఈవో

సీతంపేట రూరల్: విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలని డిప్యూటీ డీఈవో పి.నారాయుడు సూచించారు. బుధవారం సీతంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సబ్జెక్ట్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్జెక్ట్ కాంప్లెక్స్‌లో గ్రూప్ డిస్కషన్స్ జరగాలని తెలిపారు.కఠినమైన టాపిక్స్‌లో కూడా గ్రూప్ డిస్కషన్స్ చేసి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రరావు, ఉపాధ్యాయులు నాయుడులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

● కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సుగుణకుమారి



మక్కువ: గర్భిణులకు సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గరుగుబిల్లి : గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.సుగుణకుమారి కోరారు. బుధవారం మండలంలోని రావివలస ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని కారివలస అంగన్‌వాడీ కేంద్రంలో సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు హైమావతి పాల్గొన్నారు.

●**మక్కువ:** పోషకాహారంతోనే ఆరోగ్యం సాధ్యమని పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అనంతలక్ష్మి తెలిపారు.మార్కొండపుట్టి అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగాగర్భిణులకు సీమంతాలు,ఆకుకూరలు, కాయగూరలతో పౌష్టికాహార ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ లీల, సర్పంచ్ రాములమ్మ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చాలి

భామిని: తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీఎల్ నారాయణరావు తెలిపారు. బుధవారం స్థానిక కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ విద్యతోనే తమ భవిష్యత్తు మారుతుందన్నారు. ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు పెన్నులు ఇచ్చి ఆహ్వానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు.

బాణసంచా సామగ్రి స్వాధీనం

సీతానగరం: మండలంలోని పెదంకలాంలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా సామగ్రిని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఎస్ఐ ఎం.రాజేష్ కథనం మేరకు.. పెదంకలాం సమీపంలోని కళ్లాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన మందు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ముగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వీరిపై కేసు నమోదు చేశారు.

జనసేనలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి చేరిక

జియ్యమ్మవలస: గవరమ్మపేట పంచాయతీ వెంకటరాజపురానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కర్రి వెంకటేష్‌కుమార్ జనసేనలో చేరారు. ఈ మేరకు బుధవారం ఆయన విశాఖలో జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ శివశంకర్‌ను కలిశారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



భామినిలో వినాయకుడిని ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు

భామిని: భామినిలో వినాయకవిగ్రహాల నిమజ్జనాలు ఘనంగా బుధవారం నిర్వహించారు. 12 రోజుల పాటు మండపాల్లో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మేళతాళాలు, కోలాటాలతో యువత, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వంశధార నదిలో నిమజ్జనం చేశారు. అలాగే సొలికిరిలో సత్యనారాయణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంజనేయ విగ్రహం వద్ద శాంతి హోమం చేపట్టారు.

ఎరువుల ఖర్చు తగ్గించుకోవాలి: ఏవో



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో తిరుపతిరావు

పాచిపెంట: రసాయన ఎరువులు, పురుగు మందులపై అయ్యే ఖర్చు తగ్గించుకుని వ్యవసాయం చేసుకోవాలని ఏవో కె.తిరుపతిరావు తెలిపారు. బుధవారం మండలంలో గల కోస్టువలసలో రైతులకు ప్రకృతి సేద్యం జోనల్ యాంకర్ యశోదమ్మ, ఏఎస్ఎఫ్ఏ శారద రైతులకు శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రసాయన వ్యవసాయాన్ని ప్రకృతి వ్యవసాయంతో కలిపి అనుసంధానం చేసుకునే విధంగా రైతులు పాతాలకు ప్రారంభించామనితెలిపారు. రైతులు క్రమ క్రమంగా ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని, గట్లపై కూరగాయలు సాగు చేపట్టాలని, పెరటి తోటలు పెంచాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వినోద్‌కుమార్, ఐసీఆర్‌పీ విజయ్ పాల్గొన్నారు.

అధిక దిగుబడి సాధించాలి: డీపీఎం

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడి సాధించాలని డీపీఎం షణ్ముఖరాజు తెలిపారు.బుధవారం మండలంలోని తాడికొండలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు సామూహిక జిల్లేడు ద్రావణం తయారు చేసే విధానాన్ని వివరించారు. అనంతరం శ్రీరాగి, పలు పంటలను పరిశీలించారు.కార్యక్రమంలో సర్పంచ్ మండంగి జగ్గారావు, రైతులు ప్రభావతి, బొజ్జయ్య, సిబ్బంది జి.అన్నపూర్ణ, నిర్మల, పరశురాం, డిల్లీశ్వర్ పాల్గొన్నారు.

దత్తివలసలో పరిశుభ్రతపై అవగాహన

సాలూరు రూరల్: దత్తివలసలో బుధవారం రాత్రి దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయించారు. వైద్యసిబ్బంది సాయిమురళి తదితరులు ఆరోగ్య, పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

వరద బాధితులకు విరాళం



జగదీశ్వరికి విరాళాలను అందిస్తున్న టీడీపీ ప్రతినిధులు

గరుగుబిల్లి : విజయవాడ వరద బాధితులకు టీడీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో సేకరించిన రూ.ఐదు లక్షలు బుధవారం పార్టీ మండలాధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు ఆధ్వర్యంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదనరావుతో పాటు పురుషోత్తంనాయుడు, అంబటి తవిటినాయుడు, ముదిలిబాబు విజయవాంకుశంలు మాట్లాడుతూ 25 పంచాయతీల్లో విరాళాలుగా సేకరించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల నుంచి సేకరించిన మొత్తాలను ముఖ్యమంత్రికి అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధులు ఎం.సింహాచలంనాయుడు, ఎం.నారాయణస్వామి, పి.పూర్ణచంద్రరావు, బి.జగదీష్, జి.లక్ష్మణనాయుడు, వైశ్రీనివాసరావు, వి.దివాకర్, గోవిందనాయుడు, ఎ.అప్పలనాయుడు పాల్గొన్నారు.

విశ్వకర్మకు ప్రత్యేక పూజలు

వీరఘట్టం: వీరఘట్టంలోని విరాట్ విశ్వకర్మ జయంతి పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ విగ్రహాన్ని వీధుల్లో కోలాటాలు, వాయిద్యాలతో ఊరేగించారు.

దాడులను ధైర్యంగా ఎదుర్కోవాలి: ఎస్ఐ

గరుగుబిల్లి: మహిళలపై జరుగుతున్న దాడులను ధైర్యంగా ఎదుర్కోవాలని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. బుధవారం గరుగుబిల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రాంగణంలో సురక్షిత గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా మహిళా వెల్ఫేర్ సొసైటీ, రెడ్ అలర్ట్ అండ్ షై ఛాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధారాణి మాట్లాడుతూ బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి జి.పద్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్‌నాయుడు